ప్రజాశక్తి

బుధవారం 25 డిసెంబర్ 2024

5

పార్వతీపురం మన్యం

డిప్యూటీ డిఇఒగా కెఆర్‌పి కుమార్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఉపవిద్యాశాఖ అధికారిగా కె.రవిప్రసన్నకుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. రంపచోడవరం ఐటిడిఎ ముసురుమిల్లీ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ ఉద్యోగోన్నతపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఇన్చార్జి డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు నుంచి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రవి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆయనకు నారాయుడు, పిఎంఆర్సి సిబ్బంది పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సత్కరించారు.

వరుస తుపాన్లతో అన్నదాత కుదేలు

- పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం
- భారీ వర్షాలతో వరి పంట నీటి పాలు
- రైతుల శ్రమకు దక్కని వ్యవ'సాయం'

ప్రజాశక్తి - పార్వతీపురం

వరుస తుఫాన్లతో అన్నదాత కుదేలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. గత వారం రోజుల వ్యవధిలోనే రెండు తుఫాన్లు రావడంతో రైతుల కంటిమీద కునుకు లేని పరిస్థితి ఏర్పడింది. సరిగ్గా వరి పంట చేతికొచ్చిన సమయంలో తుఫాన్లతో అన్నదాత వెన్ను విరిగింది. కోత కోయాల్సిన సమయంలో వర్షాలు పడడం వల్ల వరి చేలు నేలకొరిగాయి. కోసిన వరి పంట తడిసి ముద్దయింది. వరి నూర్పులు తర్వాత ధాన్యం విక్రయించే సమయంలోనూ వానలు పడడంతో తడిసిపోయాయి. మన్యం జిల్లాలో 3.7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరుగుతందని అధికారులు అంచనా వేశారు. ఇందులో 2.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసింది. క్వింటాకు మద్దతు ధరగా రూ.2100 నుంచి రూ.2300గా ప్రకటించింది. అయితే వారి పంట విషయంలో పెట్టిన మదుపుల కన్నా రైతుకు దక్కిన ఆదాయం బాగా తక్కువ. దీంతో చాలా మంది రైతులు వరి పంట సాగు నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఉన్నారు. సరిగ్గా వరి కోతల సమయంలో వరుస తుఫాన్లతో రైతులు మానసికంగా కృంగిపోయిన పరిస్థితి నెలకొంది. సాలూరు మండలంలోని కొత్తవలస ప్రాంతంలో దీర్ఘకాలిక వరి విత్తనాలు నాటడంతో ఇంకా కోతకు రాని ఏర్పడింది. ఈలోగా వరుస తుఫాన్లు రావడంతో వరి పంట నేలకొరిగింది. మరి కొంతమంది వరి చేలు కోసిన తర్వాత మడుల్లోనే ఉండి పోవడంతో తడిసి ముద్దవుతున్నాయి.

పత్తి, మొక్కజొన్నకు తీవ్ర నష్టం

అకాల వర్షాలతో రైతులు ఆర్థికంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడి డబ్బులు కూడా రాకపోవడంతో వారు సాగుపై అసంతృప్తితో ఉన్నారు. వరి సాగు ద్వారా రైతులు కుదేలయ్యే పరిస్థితి దాపురించింది. మరో పక్క మొక్కజొన్న, పత్తి పంటలకు కూడా అధిక వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక పంట సాగులో నష్టపోయిన రైతులకు మరో పంట సాగుతో అప్పుల బారి నుంచి బయటపడొచ్చు నని రైతులు భావిస్తున్నారు. అయితే ఆ పరిస్థితి లేకుండా రెండు వరుస తుఫాన్లతో పత్తి, మొక్కజొన్న పంటలు నష్టపోయే అవకాశం ఏర్పడింది. జిల్లాలో వరి తర్వాత ఎక్కువగా పత్తి, మొక్కజొన్న సాగు చేస్తున్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ రెండు పంటలు దెబ్బతినే పరిస్థితి కనిపిస్తోంది. మొక్కజొన్న మొగ్గ దశలోనే ఉండడంతో అధిక వర్షాలకు అది కుళ్లిపోయే అవకాశం ఉంది. దీంతో ఈ పంట సాగుకు రైతులు పెట్టిన పెట్టుబడి ఖర్చులు వృథా అయ్యే దుస్థితి ఏర్పడింది. పత్తి సాగు విషయంలోనూ రైతులు నష్టపోతున్నారు. మొదటి పికింగ్‌లో చేతికొచ్చిన పంటను రైతులు అమ్ముకున్నారు. రెండు, మూడు పికింగ్‌లకు రావాల్సిన దిగుబడి రాకుండా వర్షాలు దెబ్బ తీస్తున్నాయి. పత్తి గింజలు అధిక వానలకు కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులను అకాల వర్షాలు తేరుకోని విధంగా దెబ్బ తీశాయి.

వర్షసూచనతో సీతంపేటలో వరి దిబ్బలు వేస్తున్న రైతు

సాలూరు మండలం కొత్తవలసలో నీట మునిగిన వరి పనలు

రైతుకు వ్యవ'సాయ'మేదీ?

తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందే పరిస్థితి కనుచూపు మేరలో కనిపించడం లేదు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు దాటింది. ఎన్నికల ముందు టిడిపి కూటమి పార్టీలు ఇచ్చిన హామీల్లో అన్నదాత సుఖీభవ కింద ప్రభుత్వం ఏడాదికి రూ.20వేలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చాయి. అయితే ఇంతవరకు ఆ హామీ అమలుపై స్పష్టత లేదు. గత ప్రభుత్వం హయాంలో ఏడాదికి రైతుకు రూ.13వేలు చొప్పున ఆర్థిక సహాయం అందేది. కేంద్ర ప్రభుత్వం మూడు విడతల్లో రైతులకు రూ.6వేలు మంజూరు చేస్తోంది. కానీ రాష్ట్ర ప్రభుత్వ వాటా సాయం మాత్రం ఇంతవరకు పంపిణీ కాలేదు. ప్రకృతి వైపరీత్యాలతో అతలాకుతలమవుతున్న అన్నదాతల బతుకుల్లో వెలుగు నింపే ప్రయత్నాలు చేస్తున్న దాఖలాల్లేవు. అన్నదాత సుఖీభవ కింద ప్రభుత్వం ఎప్పుడు ఆర్థిక సహాయం చేస్తుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

సీతంపేట: ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలకు రైతులకు దెబ్బ మీద దెబ్బ పడుతూనే ఉంటుంది. రైతు పంట కోత కోసే సమయానికి వర్షాల ఇబ్బందులు తప్పడం లేదు. సీతంపేట ఏజెన్సీలో 6350 ఎకరాల్లో వరి సాగవ్వగా, 90 శాతం వరకు పంట కోత పూర్తియింది. దోనుబాయి పరిసర ప్రాంతాల్లో ఒక ఐదు శాతం కోసి ఉండగా, మరి కొంత కోత జరగలేదు. ఈ వర్షాలకు రైతు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వర్షాలకు భయపడి రైతులు హుటా హుటిన పొలాల్లోనే కుప్పలు వేస్తున్నారు. మరోపక్క టార్పలియన్లతో కప్పుతున్నారు. అయితే తడిసిన, రంగు మారిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

మళ్లీ మొదలైన తుపాను కష్టాలు

పార్వతీపురం రూరల్ : గత వారంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కోతలు పూర్తి చేసుకున్న రైతులు తమ చేలను పొలాల్లోనే కుప్పలు వేసుకొని కాపాడుకున్నారు. వర్షాలు తగ్గి తమ వ్యవసాయ ఉత్పత్తులను బళ్లతో కళ్లాలకు చేర్చుకునేందుకు సిద్ధమవుతున్న సమయంలో వాతావరణంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సోమవారం రాత్రి నుండి కురుస్తున్న ఎడతెరిపిలేని చినుకులు వారి పనులకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. మండలంలోని పెద్దబొండపల్లి, నర్సిపురం, చిన్న బొండపల్లి, సంగంవలస, ఎంఆర్‌నగరం తదితర ప్రాంతాల్లో రైతులు బళ్ల ద్వారా పంటను తరలిస్తుండగా అకస్మాత్తుగా ఏర్పడిన వాతావరణంలో మార్పు వల్ల బళ్లు పొలాల్లో దిగబడిపోయి ఉత్పత్తులను తరలించలేని పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. పండగ ముందు నూర్పులు చేసుకొని నాలుగు డబ్బులు కళ్ల చూద్దాం అనుకుంటున్నా అన్నదాతల ఆశకు ఈ అకాల వర్షాలు గండి కొడుతున్నాయి.

కళ్లాలకు నాటుబల్లతో వరిచేలను తరలిస్తున్న రైతులు

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల పరిశీలకులు శేషగిరిబాబు, కలెక్టర్ శ్యాం ప్రసాద్

18 ఏళ్లు నిండిన యువతపై దృష్టి సారించాలి

జిల్లా ఎన్నికల పరిశీలకులు శేషగిరిబాబు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతపై ప్రత్యేక దృష్టిని సారించి ఓటరుగా నమోదు చేయాలని రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ కమిషనర్, ఇన్ స్పెక్టర్ జనరల్, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎంవి శేషగిరిబాబు తెలిపారు. ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం-2025పై జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు, అన్ని మండలాల తహశీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక ఓటర్ల సవరణ, నమోదు ప్రక్రియ జరిగిందని, ఇందులో ఏమైనా అభ్యంతరాలు, తొలగింపులుంటే తెలియజేయాలని రాజకీయ పక్షాలను కోరారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం బాగా నిర్వహించిందని, ప్రత్యేక శిబిరాల్లో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వామ్యం అయ్యారని, ఎటువంటి సమస్యలు జిల్లాలో లేవని రాజకీయ పక్షాలు తెలియజేయడంతో ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రత్యేక ఓటర్ల సవరణ వచ్చే ఏడాదిలో నాలుగు సార్లు జరగనుందని, కొత్తగా ఓటరు నమోదు కావాల్సిన వారు, తొలగింపులు, మార్పులు, చేర్పులు చేసుకునే సౌలభ్యం ఉంటుందని సూచించారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతను ఓటరుగా నమోదు చేసేందుకు ప్రతి కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలను జిల్లావ్యాప్తంగా నిర్వహించి నమోదు చేస్తామని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్‌కు వివరించారు. బిఎల్‌ఒల ద్వారా స్వీప్ కార్యక్రమం, ప్రత్యేక శిబిరాలను నిర్వహించి ఓటర్ల నమోదు, సవరణలు చేసినట్లు వివరించారు. రాజకీయ పక్షాలతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సమావేశంలో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి,, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అన్ని మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

పీసా ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలోని గ్రామాల్లో పీసా (పంచాయతీరాజ్ ఎక్స్ టెన్షన్ షెడ్యూల్డ్ యాక్ట్) కమిటీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. స్థానిక ఐటిడిఎలో ఎంపిడిఒలు, తహశీల్దార్లతో పీసా కమిటీ ఎన్నికలపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటిడిఎ పరిధిలోని 278 పీసా గ్రామ సభలకు ఉపాధ్యక్షులు, కార్యదర్శి పదవులకు 2025 జనవరి 2 నుంచి 6 వరకుఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. పీసా గ్రామాల్లోనూ, ఆవాసాల్లో నివసిస్తున్న గిరిజనులకు, ఇతర ప్రజలందరికీ ఈ నెల 24 నుంచి 31 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పార్టీలకు అతీతంగా జరగబోయే ఈ ఎన్నికల్లో గిరిజనులు ఎవరైనా పోటీ చేయవచ్చని, ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా గిరిజనులను ప్రోత్సహించాలని, గెలిచిన అభ్యర్థుల పదవీకాలం ఐదేళ్లు ఉంటుందని అన్నారు. కావున ఈ ఎన్నికలపై 278 పీసా గ్రామాల్లో, ఆవాసాల్లో అవగాహన కల్పించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని ఎన్నికలు జరగబోవు ప్రదేశం, ఎన్నికల తేదీ, సమయం తదితర వివరాలను గ్రామసభ సభ్యులందరికీ తెలియజేయాలని ఆదేశించారు. అలాగే గ్రామాలన్నింట్లో, గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో పోస్టర్లు అతికించాలని ఎంపిడిఒలు, తహశీల్దారులకు సూచించారు. గ్రామ గ్రామాన దండోరా వేయించడం, మీడియా ద్వారా ప్రచారం, కరపత్రాల పంపిణీ మొదలగు మార్గాల ద్వారా గిరిజన ప్రజలందరికీ అవగాహన కల్పించి, పీసా ఎన్నికలు విజయవంతం అయ్యేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయక ప్రాజెక్టు అధికారి పి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఫిట్ ఇండియా సైక్లింగ్ ట్యూజ్ డే కార్యక్రమంలో భాగంగా ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం జరిగింది. సెట్విజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సబ్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం యువతతో కలిసి సైకిల్ తొక్కి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ సైకిళ్ల వినియోగంపై అవగాహన, ప్రాముఖ్యతను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఒక ప్రాజెక్ట్‌గా దేశవ్యాప్తంగా కొనసాగుతూ ఒకరిని ఫిట్‌గా చేయడమే దీని ముఖ్యోద్దేశ్యమని తెలిపారు. అంతేకాకుండా వాయు కాలుష్యం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఇంధనాన్ని పొదుపు చేస్తూ, మనమంతా ఆరోగ్యంగా ఉంచేలా ఫిట్ ఇండియా కార్యక్రమం చేస్తుందని ఆయన అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో సెట్విజ్ సిఇఒ బి.రామ్ గోపాల్, పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులుగా బంగారు బాబు

వీరఘట్టం : పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షులుగా ఎ.బంగారుబాబు ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపిడిఒ బి.వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. కోశాధికారిగా చక్రధర్‌రావు, గౌరవ అధ్యక్షులుగా టి.సుధాకర్ ఎన్నికయ్యారు. వీరికి ఎంపిడిఒ ధ్రువ పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఒ డి.వెంకటరమణ, సీనియర్, జూనియర్ సహాయకులు వి.శ్రీనివాసరావు, ఎ. శ్రీకాంత్, ఎన్.కోటేశ్వరరావు, పి.రాము, ఎన్.శివ, జి.రూప, పి.తిరుపతరావు పలువురు సచివాలయాల కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జోరు వానలో

అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల మానవహారం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని గిరిజన గురుకులాల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు మంగళవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద జోరువానలో మానవహారం నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం ఇవ్వాలని, ప్రతిపాధిత డిఎస్సీ నుండి తమ పోస్టులు మినహాయించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. మురళీమోహన్, ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ, ఎస్ఎస్ఐ జిల్లా కమిటీ సభ్యులు డేవిడ్, రాజు మాట్లాడుతూ గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోరాటంలో భాగస్వామ్యమవుతామని, పోరాటం ఉధృతం చేయాలని అన్నారు. గత 15-20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారిని రోడ్డున పడేయడం కూటమి ప్రభుత్వానికి తగదని అన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రజా సంఘాలతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ఇల్లు ముట్టడికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు దివాకర్, కామేష్, రాజేష్, జ్యోతి, ఉమా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బిఎస్‌పి మద్దతు

గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోరాటానికి బహుజన సమాజ్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. మంగళవారం దీక్షా శిబిరం వద్దకు రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు, జిల్లా అధ్యక్షులు తాడంగి మిన్నరావు, కార్యదర్శి పాలక సుధీర్ వచ్చి మాట్లాడారు. సమస్య పరిష్కారం కోసం తమ పార్టీ ద్వారా ప్రయత్నిస్తామని తెలిపారు.

పార్వతీపురంలో మావనహారం నిర్వహిస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, ప్రజాసంఘాల నాయకులు

విద్యార్థుల తల్లిదండ్రుల నిరసన

కురుపాం : జోరు వానను సైతం లెక్కచేయకుండా మండల కేంద్రంలో గల గురుకుల పాఠశాల గేటు వద్ద పాఠశాల విద్యా కమిటీ వైస్ ఛైర్మన్ కూరంగి సీతారాం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ గిరిజన గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు నెలరోజులుగా వారి హక్కుల సాధన కోసం పాఠశాలలను విడిచిపెట్టి ఐటిడిఎ కేంద్రాల్లో ధర్నా చేపడుతున్నారని, నేటికీ కూడా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని, దీనివల్ల విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని అన్నారు. మరికొద్ది నెలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు విద్యార్థులు రాయాల్సి ఉందని, కానీ నేటికీ వారికి చదువులు జరగడంలేదని, కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టి విద్యార్థులకు సిలబస్‌ను పూర్తి చేసి చదువులను అందించాలని అన్నారు. లేకుంటే రానున్న రోజుల్లో విద్యార్థులకు చదువులు అందే వరకు పోరాడుతామని ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

కురుపాం గురుకుల పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు, పక్కన వైస్ ఛైర్మన్లు

రైతులను సకాలంలో ఆదుకోవాలి

వెంటనే టార్పాలిన్లు అందించాలి

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలపై చర్చ

ప్రజాశక్తి-విజయనగరం

వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం సకాలంలో ఆదుకోవాలని, తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు అవసరమైన టార్పాలిన్లను వెంటనే అందించాలని ఉమ్మడి జిల్లాల వ్యవసాయాధికారులను జిల్లా పరిషత్తు ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. స్థాయీ సంఘ సమావేశాలను జెడ్‌పి సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన, 3వ స్థాయీ సంఘ సమావేశం వైస్ ఛైర్మన్ బాపూజీనాయుడు అధ్యక్షతన, 6వ స్థాయీ సంఘ సమావేశం ఆ సంఘ ఛైర్మన్ కొర్రజెన్ని సింహాచలం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల్లోని వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ తడిచిన ధాన్యం ఆరబెట్టేందుకు ఎన్ని టార్పాలిన్లు సరఫరా చేశారని వ్యవసాయాధికారులను ప్రశ్నించారు . మన్యం జిల్లాలో ఇప్పటివరకు 1570 టార్పాలిన్లు సరఫరా చేసినట్లు ఆ జిల్లా వ్యవసాయాధికారి కె. రాబర్ట్‌పాల్ తెలిపారు. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏయే మండలానికి ఎన్ని టార్పాలిన్లు సరఫరా చేశారో సంబంధిత వాట్సాప్ గ్రూప్‌లో పెట్టాలని, దానివల్ల పూర్తి సమాచారం అందుతుందని సూచించారు.

కొర్రజన్ని సింహాచలం అధ్యక్షతన జరిగిన ఆరో స్థాయి సమావేశంలో సాంఘిక సంక్షేమ, వెనుకబడిన సంక్షేమ శాఖలతోపాటు విదేశీ విద్యపై చర్చించారు. గార తవుడు, మామిడి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో తీర్మానాలు లేకుండానే గోశాలలు కట్టడానికి అనుమతిస్తున్నారని చెప్పారు. జలజీవన్ మిషన్‌లో అమలయ్యే పనులకు ఈ నెలాఖరులోగా ఎం-బుక్‌లను పూర్తిచేసి పంపించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. స్థాయీ సంఘ సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలకు సంబంధించి పూర్తి నివేదికలతో రానున్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలని ఛైర్మన్ కోరారు. ఈ సమావేశాల్లో జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, ఆయా సంఘాల సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

రెవెన్యూ సదస్సుల ద్వారా గ్రామాల్లో ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారం జరుగుతుందని మండల హెచ్‌డిటి పి.కిరీటి తెలిపారు. మండలంలోని జమదాల పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో గ్రామ పరిధిలోని రెవెన్యూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించినట్లుగా ఆయన తెలిపారు.

అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రజల్లో చైతన్యం కల్పించి సైబర్ నేరాలపై వారికి సంపూర్ణ అవగాహన కల్పించడం ద్వారా అడ్డుకట్ట వేయవచ్చని ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో యూనియన్ బ్యాంక్ అధికారులు సైబర్ నేరాల నిరోధానికి సంబంధించి అవగాహన గోడపత్రికలను విడుదల చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల నుంచి మనం ప్రజలను ఎలా కాపాడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సైబర్ నేరాలను జిల్లాలో ఏ విధంగా అరికట్టాలి, ప్రజలను ఏ విధంగా అప్రమత్తం చేయాలి, వారి డబ్బును బ్యాంకుల్లో ఏ విధంగా భద్రతగా ఉండేలా చూడాలనే మేధోమతనం బ్యాంకర్స్‌తో చేశామన్నారు. దానిలో భాగంగా యూనియన్ బ్యాంక్ ముందుకు రావడం హర్షనీయమన్నారు. అవగాహన కార్యక్రమాలు బ్యాంకర్స్, పోలీస్ శాఖ సమన్వయంతో నిర్వహిస్తామన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కోసం రూపొందించిన బ్యానర్లను ప్రజలకు అవగాహన ఉండేలా బ్యాంకుల్లో, ఏటిఎం కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత లోపం వల్ల ఏదో ఒక సైబర్ నేరాల్లో చిక్కుకోవడం, నగదును పోగొట్టుకోవడం జరుగుతుందని అటువంటి వాటి పట్ల ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కరపత్రాల పంపిణీ, విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత గురించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. అనంతరం సిఎస్‌ఆర్ యాక్టివిటీలో భాగంగా యూనియన్ బ్యాంక్ తరపున సైబర్ సెల్ కోసం కుర్చీలు, టేబుళ్ల వితరణ చేశారు. కార్యక్రమంలో ఎఎస్‌పి అంకిత సురాన, యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ వెంకట్ తిలక్, బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ, సిఐలు శ్రీనివాసరావు, రంగనాథం, ఎర్రంనాయుడు, మురళీధర్, అప్పారావు, ఆర్ఐలు నాయుడు, శ్రీరాములు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి, పక్కన ఎఎస్‌పి, బ్యాంకు అధికారులు

రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి రాంబాబు

సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - వీరఘట్టం

సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని పాలకొండ డిఎస్‌పి రాంబాబు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడిపేందుకు అవగాహన కల్పించాలన్నారు. హెల్మెట్ లేని పక్షంలో పెనాల్టీలు వేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే అటువంటి వారిపై కేసులు నమోదు చేయాలని సిబ్బంది ఆదేశించారు. క్రైమ్ రేటు తగ్గించాలని, రికార్డులు నిర్వహణ సక్రంగా ఉన్నందున సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయనతో పాటు సిఐ ఎం.చంద్రమౌళి, స్థానిక ఎస్సై జి.కళాధర్, సిబ్బంది ఉన్నారు.

ప్రపంచ సాహిత్య మహాసభలకు దేవానంద్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 28, 29 విజయవాడలో జరగనున్న ప్రపంచ తెలుగు మహాసభలకు ప్రముఖ కవి, మండల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పాలక దేవానంద్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. కవులు, సాహితీ చైతన్య కిరణాలు, బాల కథా నిలయం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు భోగెల ఉమామహేశ్వరరావు(ఉమాకవి) ఆహ్వానించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉమా కవి తెలుగు సాహిత్యకిరణాలు పుస్తకాన్ని ఆవిష్కరించబోతున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పల్లా సోదరులు

ప్రజాశక్తి - పాలకొండ

ఎమ్మెల్యే జయకృష్ణను సన్మానిస్తున్న పల్లా సోదరులు

నగరపంచాయితీ చైర్మన్‌గా నియమితులైన పల్లా ప్రతాప్, నగర పంచాయితీ సమన్వయ కర్త పల్లా కొండలరావు స్థానిక ఎమ్మెల్యే జయకృష్ణను తన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయకష్ణ మాట్లాడుతూ నగరపంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాలని, తన వంతు సహకారం పూర్తిస్థాయిలో ఉంటుందని అన్నారు. దీనికి వారు కూడా సానుకూలంగా స్పందించి పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అన్నారు.

కాశీపేటలో గోశాల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ త్రివిక్రమరావు

గోశాలల పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కాశీపేటలో నిర్మిస్తున్న గోశాలల పనులను ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోశాల పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ చట్టం కింద మంజూరైన పనులను పూర్తి చేయాలన్నారు. నిధులకు ఎప్పుడు నిధులకు కొరతలేదని ఇప్పుడు అప్పుడే బిల్లులు చేయడం జరుగుతుందన్నారు. గోశాల నిర్మాణం చేస్తున్న రైతులతో మాట్లాడి పనులు వేగవంతమై చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా వినియోగదారుల సంఘంలో మెరుగైన పాత్ర పోషించిన సంఘ సభ్యులకు కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన వినియోగదారుల సంఘ సభ్యులు బాబీకి ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

తడి, పొడి ధాన్యం, పత్తిని కొనుగోలు కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కొమరాడలో రైతులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరుస తుపాన్లు వల్ల ధాన్యం కొంత పొలాల్లోనూ, మరికొంత కల్లాలోనూ ఉండిపోయే పరిస్థితి ఉందని అన్నారు. మిల్లర్లకు తరలించిన సమయంలోనూ ధాన్యం తడిచిపోయే పరిస్థితి ఉందన్నారు. కాబట్టి తడిసిన, రంగు మాలిన ధాన్యాన్ని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పత్తి కూడా రైతులు అమ్ముకోవడానికి అటు భామిలి, ఇటు రామభద్రపురం వెళ్లాలంటే సుమారు వంద కిలోమీటర్లకు పైగా వెళ్లాల్సి వస్తుందన్నారు. రైతులు తాము పండించిన పత్తి పంటను ప్రభుత్వం ప్రకటించిన రూ.7525 ఉన్నప్పటికీ కేవలం రూ.5వేలు, రూ.5,500 దళారులకు అమ్ముకునే పరిస్థితి ఉందన్నారు. మన్యం జిల్లా కేంద్రంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - సీతంపేట

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి అని ఎస్సై వై.అమ్మనరావు అన్నారు . మంగళవారం సీతంపేట మెయిన్ రోడ్‌లో రోడ్డు భద్రత లో భాగంగా హెల్మెట్ ధరించడంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలన్నారు. దీనివల్ల ఎటువంటి ప్రమాదాలు జరగవన్నారు. హెల్మెట్ ఉపయోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులకు తప్పనిసరిగా హెల్మెట్‌తో పాటు లైసెన్స్, సి-బుక్, ఇన్సూరెన్స్ ఉండాలన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

సీతానగరం : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. స్థానిక హనుమాన్ జంక్షన్‌లో మంగళవారం ప్రజలకు, ప్రయాణికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు దిశా యాప్ ద్వారా ఆపదలో ఉన్నప్పుడు వెంటనే ఫోన్ చేస్తే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే మైనర్ పిల్లలకు మోటర్ వాహనాలను ఇవ్వరాదన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించొచ్చన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు, కానిస్టేబుల్ పద్మ, ప్రయాణికులు పాల్గొన్నారు.

వాహనచోదకులు అవగాహన కల్పిస్తున్న సీతంపేట ఎస్ఐ అమ్మన్నరావు

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రతి ఒక్కరూ వినియోగదారులేనని, కావున మనందరికీ వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని ఉద్బోధించారు. మంగళవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకలు పౌర సరఫరాల సంస్థ నేతృత్వంలో జరిగాయి. ఈ వేడుకల్లో కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారుల చట్టాలపై ప్రజల్లో అవగాహన మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పౌరుడు చట్టాల గూర్చి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించే దిశగా వినియోగదారుల క్లబ్‌లను నిర్వహిస్తున్నామని, అవగాహన సదస్సులు నిర్వహించి వినియోగదారుల హక్కులను తెలియజేస్తున్నట్లు చెప్పారు. పాలథిన్ కవర్లు, ప్లాస్టిక్ బాక్స్‌ల్లోని తినుబండారాలు, రోడ్లపై బండ్ల వద్ద తయారయ్యే కలుషిత ఆహార పదార్థాలతో కేన్సర్ వంటి రోగాలు వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ గుర్తుచేశారు. అందుకే స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగంగా ప్లాస్టిక్‌ను నిషేధించనున్నట్లు చెప్పారు. సైబర్ క్రైం ఇటీవల ఎక్కువగా ఉందని, ఈ - కామర్స్ మోసాలకు గురికాకుండా వినియోగదారులు జాగ్రత్త వహించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కళాశాల, పాఠశాల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి విజేతలకు కలెక్టర్ నగదుతో పాటు ధ్రువీకరణ పత్రాలను బహూకరించారు. మేలుకొలుపు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా ప్రజలను చైతన్యవంతులను చేయడంలో విశేష కృషి చేసిన పలు వాలంటరీ ఆర్గనైజేషన్లను కలెక్టర్ సత్కరించారు. తొలుత ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ శాఖల ప్రదర్శన స్టాళ్లను తిలకించారు. కార్యక్రమంలో కెఆర్‌ఆర్సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మ చంద్రారెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహన్ రావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ కె.రత్నరాజు, జిల్లా ఆహార తనిఖీ అధికారి ఏ.రామయ్య, జిఎస్‌టి సహాయ కమిషనర్ డి.మోహనరావు, వినియోగదారులు, విద్యార్థులు, వాలంటరీ ఆర్గనైజేషన్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్, పక్కన సబ్‌కలెక్టర్లు, డిఆర్‌ఒ

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు గొర్లె వెంకటరమణ

రెగ్యులర్ వైద్యులను నియమించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని 15 వార్డుల ప్రజలకు వైద్యసేవలందించేందుకు ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్‌లో రెండేళ్లుగా పూర్తి స్థాయిలో వైద్యులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఎం నాయకులు జి.వెంకటరమణ, పాకల సన్యాసిరావు, బివి రమణ, బంకురు సూరిబాబు తదితరులు విమర్శించారు. మంగళవారం జగన్నాథపురంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిపిఎం ప్రతినిధి బృందం సందర్శించింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ గత రెండేళ్లుగా పట్టణ ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ వైద్యులు లేరని, దీంతో వైద్యంపై పూర్తిస్థాయిలో అవగాహన లేని సిబ్బంది చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇది అత్యంత ప్రమాదకరమైన దుస్థితి అని ఆందోళన వ్యక్తం చేశారు. పార్వతీపురంలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా గుర్తించబడిన జగన్నాథపురం ప్రాంత ప్రజలకు ఎంతో అవసరమైన ఈ ఆసుపత్రి విషయంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. గత నెలలో ఈ ఆసుపత్రిని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సందర్శించారని అయినప్పటికీ అక్కడ వైద్యులను నియమించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ప్రజలు వివరించినట్లు సిపిఎం నాయకులు తెలిపారు. ప్రస్తుతం వారంలో సోమ, మంగళ, బుధవారాలకు ఒక వైద్యాధికారిని, గురు, శుక్ర, శనివారాలకు ఒక వైద్యాధికారిణి తాత్కాలిక ప్రాతిపదికన నియమించినప్పటికీ పూర్తిస్థాయిలో వైద్యం ప్రజలకు అందుబాటులోకి రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి అర్బన్ హెల్త్ సెంటర్లో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో ఈ ప్రాంత ప్రజలతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రాజశేఖర్, జి.తులసి తదితరులు పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర కుటుంబానికి స్థానిక ఆర్ సిఎం చర్చి ఫాదర్‌లు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన నివాసానికి వెళ్లి రాజన్నదొర,ఆయన సతీమణి రోజమ్మలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎం.అప్పారావు పాల్గొన్నారు.
-ప్రజాశక్తి, సాలూరు

నిరసనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా ఈనెల 27న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో చేపట్టబోయే ఆందోళనలో పార్టీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై విద్యుత్ అదనపు భారం మోపడంతో ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కురుపాం నియోజకవర్గ కేంద్రంలో చెప్పట్టబోయే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

పార్వతీపురం రూరల్ : ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని అవసరమైతే తగ్గిస్తామని హామీ ఇచ్చి అందుకు విరుద్ధంగా కరెంటు చార్జీలు పెంచడం దారుణమని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 27న నియోజకవర్గ కేంద్రంలో ప్రజలతో కలిసి ర్యాలీగా వెళ్లి విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేస్తామన్నారు. కావున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల, పట్టణ వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొంగు చిట్టి రాజు, ఎంపిపి ప్రతినిధి మజ్జి శేఖర్, మన్యం జిల్లా వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు తీల్ల శివున్నాయుడు, కె.శ్రీనివాసరావు, శాస్త్రి, వైస్ సర్పంచ్ గంట రమేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రహదారి భద్రత అనేది అందరి బాధ్యతగా గుర్తెరగాలని డిప్యూటీ ట్రాన్స్ పోర్టు కమిషనర్ మణికుమార్ అన్నారు. మంగళవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో సిఎస్ఎఆర్ (కల్చరల్, స్పోర్ట్స్ అండ్ రెస్పాన్సిబిలిటీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రహదారి భద్రతను సామాజిక బాధ్యతగా గుర్తించి జాగ్రత్తగా నడుచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు కేవలం హెల్మెట్ ధరించడంతోపాటు వాహనాలను పరిమిత స్పీడులో నడపాలన్నారు. హై స్పీడులో వాహనాలు నడిపిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ రహదారి భద్రత ప్రమాణాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వివరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని నడచుకోవాలన్నారు.

ప్రభుత్వ అవసరాలకు భూములు గుర్తించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ అవసరాలకు భూములు గుర్తించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అనేక వసతులు ఏర్పాటు చేయాల్సి ఉందని, అందుకు భూమి అవసరం ఉందని అన్నారు. మండలాల్లో ప్రభుత్వ భూములను గుర్తించాలని సూచించారు. వంద విద్యుత్ కనెక్షన్లు కంటే ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో సోలార్ పవర్ ఇచ్చేందుకు అవసరమైన యూనిట్ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించాలని చెప్పారు. గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి, ఫిష్ మార్కెట్లు, నగర వనాలు, పారిశ్రామికవాడల ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. ఫిష్ హెచరీస్ నిర్మానికి ఐదు హెక్టార్లు అవసరమని, అందుకు అవసరమైన స్థలాన్ని గుర్తించాలని ఆయన ఆదేశించారు. రెవెన్యూ రికార్డులను పక్కాగా నిర్వహించాలన్నారు. అడంగల్ నిర్వహణ రెవెన్యూ వ్యవస్థకు మూలమని, వాటి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. మ్యూటేషన్ జరిగే క్రమం పక్కాగా ఉండాలని సంబంధిత అనుసంధాన ఆధారాలు విధిగా రికార్డుల్లో లభ్యంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ ఎస్)లో అందిన అర్జీలను పూర్తిస్థాయిలో విచారణ చేసి వాటిని పరిష్కరించాలన్నారు. ఇనాం భూముల సమస్యలుంటే వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టా లని అన్నారు. రెవెన్యూ సదస్సులు విజయవంతంగా నిర్వహించాలని ఆయన అన్నారు. సమావేశంలో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ కె.హేమలత, తహశీల్దార్లు పాల్గొన్నారు.

స్వయం పాలన నిర్ధారించినదే పీసా

ప్రజాశక్తి - సీతంపేట

సదస్సులో మాట్లాడుతున్న డివిజనల్ పంచాయతీ అధికారి రాంప్రసాద్

పీసా చట్టం 1996న సాంప్రదాయ గ్రామ సభల ద్వారా షెడ్యూల్డ్ ప్రాంతాలని పిలువబడే గిరిజన ప్రాంతాల్లో నివసించే ప్రజలకు స్వయం పాలనను నిర్ధారించడానికి రూపొందించబడిందని డివిజనల్ పంచాయతీ అధికారి బి.రాంప్రసాద్ అన్నారు మంగళవారం పీసా దినోత్సవం సందర్భంగా సీతంపేట గ్రామపంచాయతీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయితీ పొడిగింపు పిసా చట్టం అమలును పటిష్టం చేసేందుకు, పంచాయత్ రాజ్ మంత్రిత్వ శాఖ డిసెంబర్ 24న పీసా దినోత్సవంగా ప్రకటించిందన్నారు. పీసా దినోత్సవంలో భాగంగా పీసా చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. గ్రామ సభలను బలోపేతం చేయాలని చెప్పారు. షెడ్యూల్ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీల పనితీరును మెరుగుపర్చడంపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన పాలన సామర్థ్యాన్ని పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గీతాంజలి, సిఎస్‌డిటి మధుసూదనరావు, ఆర్ఐలు వెంకటేష్ కవిత, సర్పంచ్ కళావతి, పంచాయతీ పంచాయతీ కార్యదర్శి బి.రామకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : పీసా చట్టంపై స్థానిక గ్రామ సచివాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీసా చైర్మన్, సర్పంచి బి.గౌరీశంకర్రావు మాట్లాడుతూ గిరిజన హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. రాజ్యాంగం కల్పించిన గిరిజనుల హక్కులు, చట్టాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిషోర్, మాజీ సర్పంచ్ బండారు నీలకంఠం, గ్రామ సేవాదళ్ బిఎల్, మాజీ వర్తక సంఘ అధ్యక్షులు విష్ణు బాబు, వెలుగు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మక్కువ: మండలంలోని పనసభద్ర, దబ్బగెడ్డ, శంబర మార్కొండపుట్టి పంచాయల్లో పీసా చట్టంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజనులకు హక్కులపై అవగాహన కల్పించారు. గిరిజన హక్కులను హరిస్తూ పెత్తందారులెవరు దౌర్జన్యాలకు పాల్పడకూడదని అలా ఎక్కడైనా చోటు చేసుకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ఆయా గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నూర్పులు వాయిదా వేసుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి - సీతానగరం

బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం కారణంగా రైతులు వరి నూర్పులు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ సూచించారు. మండలంలోని చినభోగిలి, పెదబోగిలి రైతు సేవా కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక అలాగే రైతులు ధాన్యం బస్తాల్లో నింపిన ధాన్యం ఉంటే వాటిని దగ్గరలో మిల్లులకు పంపించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఎక్కడైనా ధాన్యం తడిచినా, తేమ శాతం ఎక్కువగా ఉన్నా వాటిని కూడా మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. వర్షాలకు ధాన్యం తడకుండా ఉండేందు వరికుప్పలు, బస్తాలను కప్పుకోవడానికి 180 టార్పాలిన్‌లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు వాటిని తీసుకెళ్లవచ్చునన్నారు. ధాన్యం మిల్లులకు తరలించినప్పుడు కూడా వాహనాలపై ఈ టార్పాలిన్ ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. రైతులు వర్షాలకు ఎలాంటి ఇబ్బందికి గురైతే తహశీల్దార్‌కు, తనకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ప్రజాశక్తి -భామిని

మండలంలోని బిల్లుమడ సమీపాన పశువులు శాలలో విద్యుత్ తీగ తగిలి దామోదర ఆనందరావుకు చెందిన పాడి ఆవు మంగళవారం మృతి చెందింది. అల్పపీడనం ప్రభావంతో వీస్తున్న ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగి పాడి ఆవుకు తగలడంతో ఆవు మృతి చెందిందని ఆనందరావు తెలిపారు. ఇటువంటి ఘటనలు జరగకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆనందరావు కోరారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలని వినతి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామ అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని మండలంలోని బొడ్లపాడుకు చెందిన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన సమన్వయకర్త జనసేన జానీ, నాయకులు టి.కృష్ణ స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు వినతిని అందజేశారు. మంగళవారం ఎం.రాజపురంలో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించుకున్నారు. గ్రామంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సమస్యల పరిష్కారంతో పాటు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

గుండెపోటుతో ఉపాధి ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ కోన శంకర్ సోమవారం రాత్రి గుండుపోటుతో మృతి చెందాడు. ఎప్పటిలాగే సోమవారం కార్యాలయంలో తన విధులు ముగించుకొని తన స్వగ్రామమైన చీపురుపల్లి వెళ్లారు. సోమవారం రాత్రి స్వల్ప గుండె నొప్పి రావడంతో వెంటనే చికిత్స నిమిత్తం విజయనగరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబీకులు చెప్పున్నారు. మృతునికి భార్య నాగమణితో పాటు తల్లి అన్నదమ్ములు ఉన్నారు. చీపురుపల్లికి చెందిన శంకర్ విజయనగరంలో తన అత్తవారింటి దగ్గర ఉంటూ పూసపాటిరేగలో ఉద్యోగం చేస్తున్నాడు. శంకర్ మృతికి పని ఒత్తిడే కారణమని కుటుంబీకులతో పాటు బంధువులు స్నేహితులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా కేంద్రంలోని ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది పూసపాటిరేగ మండల ఉపాధి ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మృతి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

తోటపల్లి రిజర్వాయర్‌లో చేపపిల్లలను విడిచిపెడుతున్న చైర్‌పర్సన్ విజయరమణి

'తోటపల్లి'లో చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి - గరుగుబిల్లి

జిల్లాలో మత్స్యసంపద వృద్ధిలో భాగంగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం తోటపల్లి రిజర్వాయర్‌లో దాదాపు నాలుగు లక్షల ఫింగర్లింగ్స్ (చేప పిల్లలు)ను తోటపల్లి రిజర్వాయర్ చైర్‌పర్సన్ పొదిలాపు విజయరమణి విడిచిపెట్టారు. పది లక్షల చేప పిల్లలను గుమ్మలక్ష్మీపురం మండలం డుమ్మంగి ప్రభుత్వ చేపల పెంపక కేంద్రం నుంచి తీసుకొచ్చారు. పిఎంఎంఎస్‌ఐలో భాగంగా తొలి విడతగా అక్టోబర్ 24న ఆరు లక్షల చేప పిల్లలను తోటపల్లి రిజర్వాయర్ లో విడిచిపెట్టడం జరిగిందని, మిగిలిన నాలుగు లక్షల చేప పిల్లలను రెండో విడతగా మంగళవారం విడిచిపెట్టినట్టు తెలిపారు. దీంతో జిల్లాలో చేపల పెంపకం గణనీయంగా పెరగాలని ఆమె ఆశించారు. మత్స్యకారులు చేపల పెంపకంపై దష్టి పెట్టాలని, మత్స్య సంపద పెరిగితే ఉపాధి పెరుగుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ అక్కెన మధుసూదనరావు, తోటపల్లి ప్రాజెక్ట్ డిఇఇ టి.రఘునాధనాయుడు, ఎఇఇ కిషోర్ కుమార్, జిల్లా మత్స్య శాఖాధికారి వి.తిరుపతయ్య, ఎఫ్డీఓలు శ్రీదేవి, గోపీకృష్ణ, మత్స్యకార సంఘం నాయకులు పాల్గొన్నారు.

చండీగడ్ విద్యుత్తు కార్మికులకు మద్దతుగా

సిఐటియు నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్తు డిస్కమ్‌లను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని చండీగడ్ విద్యుత్తు కార్మికులు, ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ కేంద్రంలో మూడో సారి ఏర్పడిన మోడీ ప్రభుత్వం గతంలో కన్నా మరింత దూకుడుగా ప్రజా వ్యతిరేక, వినాశకర విధానాలను అవలంబిస్తోందని ధ్వజమెత్తారు. విద్యుత్తు రంగంపై బిజెపి ప్రభుత్వం చేస్తున్న దాడే ఇందుకు తార్కాణమన్నారు. చండీగడ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో డిస్కమ్‌లను ప్రయివేటీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయన్నారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లు నెలకొల్పడం ద్వారా ప్రయివేటీక రించే ప్రయత్నాలు ఊపందుకున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. విద్యుత్తు రంగాన్ని ప్రయివేటీకరించడానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యుత్తు రంగ కార్మికులు వీరోచితమైన పోరాటం చేస్తున్నార న్నారు. అందులో చండీగడ్ విద్యుత్తు ఉద్యోగులు, కార్మికులు అగ్రభాగాన నిలిచారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారికి మద్దతుగా దేశవ్యాప్త సంఘీభావ కార్యక్రమాలకు సిఐటియు పిలుపునిచ్చిందన్నారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చండీగడ్ విద్యుత్తు కార్మికులు, ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి మద్దతివ్వాలని కోరారు. విద్యుత్తు రంగ ప్రయివేటీకరణను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహన్, బి.రమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.ఆనంద్, నాయకులు శ్రీను, నాయుడు, శ్యామ్, నాగేశ్వరావు, హరీష్, రవి తదితరులు పాల్గొన్నారు.